# లక్ష్మణ రేఖ

" ఎందుకు చేస్తున్నావు ఈ పని?" లాఠీని వూపుతూ అడిగాడు ఎస్సై. అతను అలా అడగడం పదోసారి. ఆమె వెక్కి వెక్కి ఏడుస్తున్నది. కాని సమాధానం మటుకు చెప్పడం లేదు.

పద్దెనిమిదేళ్ల ప్రాయం కూడా రాలేదు. మొహంలో పసితనం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. ఎరువు వేసి పెంచినట్లు ఆమె యవ్వన సంపద పెరిగింది. కాని దానికి తగ్గట్టుగా మెదడు వికసించినట్లు కనిపించడం లేదు.

" ఆకలి..." చిన్నగా గొణిగింది.

" ఛీ ! ఆకలి వేస్తే అన్నం తినాలి కాని ఇవ్వేం పాడు బుద్ధులు! నీకు మొగుళ్లు కావలసి వచ్చిందే! నీలాంటి వాళ్ల వలన దేశం నాశనమై పోతున్నది." ఎస్సై అసహనంగా అరిచాడు.

" అయ్యా ! నాకు తెలియక అడుగుతాను. నా మూలంగానే దేశం నాశనమై పోతున్నదాయ్యా!" అమాయకంగా అడిగింది ఆమె.

" నిస్సందేహంగా ! నీలాంటి బజారు ముండలు సకల రోగాల్ని ప్రజలకు అంటగడతారు. దాంతో వాళ్ల ఆరోగ్యం గుల్లయిపోతుంది. మన జాతీయ ఆదాయం తగ్గిపోతుంది." లాఠీ టేబుల్ మీద కొట్టి చెప్పాడు.

" కానీ... నేను అనుకోవడం వాళ్ల రోగాలు మాకు అంటుస్తున్నారని" చిన్నగా గొణిగింది.

" ఒసే.... నీకు ఇప్పుడు బ్లడ్ టెస్ట్ చేయిస్తే హెచ్ఐవి పాజిటివ్ వస్తుందే! నిన్ను కలిసిన ప్రతి వెధవకీ ఆ జబ్బు ఫ్రీ!" వెకిలిగా నవ్వాడు ఎస్సై.

ఆమెకు ఆ జబ్బు గురించి తెలిసినట్లు లేదు పెద్దగా స్పందించలేదు.

" అయ్యా ! ఆకలికి నేను ఒళ్లు అమ్ముకుంటున్నాను. కాని వచ్చేవాళ్లు నా దగ్గరికి ఎందుకొస్తున్నారు? వాళ్లకేం ఆకలి? బొజ్జలు కుండల్లా వుంటాయి కొందరికి" ఆమె స్వగతంగా ఆలోచిస్తూ ప్రకాశంగా అడిగింది.

" నీలాంటి రంకు ముండలు ఫోజులు కొడుతూ వుంటే రాకుండా ఎలా వుంటారు? నిప్పుల్లో పడ్డ మిడతల్లాగా నీ వల్లో పడి కాలిమసై పోతారు పిచ్చి వెధవలు!" కోపంగా చెప్పాడు.

" అయ్యా ! నాకూ కడుపు నిండా పెట్టే వాళ్లుంటే ఈ ఎదవపని నేనెందుకు చేస్తాను. నన్ను చదివించే వాళ్లుంటే అన్ని పరీక్షలు ఫస్టున పాసయ్యేదాన్ని" ఏడుస్తూ చెప్పింది.

" చదువుకున్నావా?"

" తొమ్మిదవ క్లాసు "

" పదవ తరగతి పాసుకాలేదా?"

" కాదు... నన్నూ బలవంతంగా లాక్కు వచ్చేశారు ఈ ఊబిలోకి. నేనొక మర బొమ్మని. పైసలు సంపాదించాలి కండలు కరిగించుకొని పైసలు మా వాళ్ళకు పంపాలి ఏడుస్తూ చెప్పింది.

" ఏంటీ నీ మొహానికి అమ్మా నాన్నా ఉన్నారా?" ఎస్సై అడిగాడు.

" ఆ ! వున్నారు. గోదావరి జిల్లాలో - మా పినతల్లి నన్ను ఈ ముఠాకు అప్పజెప్పింది కిరాయికి. ఎంత సంపాదించినా నా కడుపు నిండదు. నేను ఎంతిచ్చినా ఈ వెధవల పర్సులు నిండవు. రంపపు కోత అనుభవిస్తున్నాను. అయ్యా ఈ పనిలో సుఖం వుందని నేను భ్రమ పడ్డం లేదు. గతిలేక చేస్తున్నాను. ఆ మాట కొస్తే కొందరు పోలీసోళ్లు కూడా వస్తూంటారు నా దగ్గరికి" ఆమె అమాయకంగా చెప్పబోయింది.

" ఆగు... ఆగు... అధిక ప్రసంగం... నువ్వు చేసిన తప్పు కప్పి పుచ్చుకోవడానికి దేనికి ఇంకొకళ్ల పరువు తియ్యడం. నా మాట విను. ఇప్పటికన్నా ఈ పాడు పని మానేసి నీ కాళ్ల మీద నువ్వు నిలబడు. ఏదన్నా పని చేసుకు బ్రతుకు." హితవచనాలు చెప్పాడు ఎస్సై.

మౌనంగా తలూపుతూ వింటూ వుంది ఆమె.

" వెంటనే నీ పేరేంటి?" అక్కడున్న ఓ విలేఖరి అడిగాడు.

ఆమె మీద లైటు ఫోకస్ చెయ్యబడింది. కెమెరా కన్ను ఆమెను మింగేస్తున్నది ఆబగా.

గబుక్కున ఆమె రెండు చేతులూ మొహానికి అడ్డం పెట్టుకుంది. "దయవుంచి నన్ను టీవీలో చూపించకండయ్యా! మీకు చేతులెత్తి మొక్కుతాను. నా పరువు పోతుంది" బ్రతిమిలాడింది.

" తప్పు చేసేటప్పుడు తెలియదా? ఇప్పుడు సిగ్గొచ్చిందా?" కెమెరా పక్కన నిలబడ్డతను అడిగాడు కిసుక్కున నవ్వుతూ....

పరిస్థితులు అలా వచ్చాయి. మేం బీదోళ్లం మాకు తిండెవరు పెడతారు? శరీర కష్టం చెయ్యాలి తినాలి." చెప్పింది ఆమె.

" సరే ముందు నీ పేరు చెప్పు - బ్రతకడానికి ప్రపంచంలో ఇన్ని మార్గాలుండగా దీన్నే ఎందుకు ఎంచుకున్నావు?" చక్రపాణి అడిగాడు. అతనొక ప్రఖ్యాత ఛానెల్ తరపున పనిచేస్తాడు.

" నేను ఎంచుకోలేదు. బలవంతాన నెట్టబడ్డాను. ఊబిలోకి నన్ను తోశారు. పైకి తీసేవాళ్లు ఎవరూ కనపడలేదు" చెప్పింది బాధగా.

" నువ్వు అడ్డు చెపితే నీ దగ్గరికి ఎవరు వస్తారు? నువ్వు ఇష్టపడే తీట తీర్చుకుంటున్నావు" అతను చెప్పాడు.

" అన్యాయంగా మాట్లాడకంటి. ఈ నీచ వృత్తిని ఎవరూ ఇష్టపూర్వకంగా చెయ్యరు. ఆ క్షణంలో నేను ఎంత చచ్చిపోతానో ఎలా చెప్పేది? పశువులు నన్ను కుమ్ముతుంటే నా బాధ ఎవరికి చెప్పుకోను? నన్ను ఒక ఆట వస్తువుగా వాడుతూ వుంటే మానవత్వం ఎక్కడ వున్నదనుకోను?" బాధగా చెప్పింది.

" ఇంతకీ నీ పేరు?"

" రాధ "

" అస్సలు పేరేనా?"

" అలా పిలుస్తారు. మాకు అస్సలు పేరంటూ ఎక్కడ వుంటుంది? ఒక్కో వూళ్ళో ఒక్కో పేరు. నెలకొకసారి ఊరు మారుస్తాం. అక్కడ మళ్లీ కొత్త పేరు పెడతారు" చెప్పింది రాధ.

" వ్యభిచారం చట్టరీత్య నేరం! నిన్ను కోర్టులో హాజరుపరిస్తే జడ్జిగారు నీకు శిక్ష విధిస్తారు" ఎస్సై చెప్పాడు.

" అంతదాకా ఎందుకయ్యా - నన్ను వదిలిపెట్టండి. మీ రుణం వుంచుకోను" భయపడుతూ చెప్పింది.

" ఛీ...ఛీ.. గుడిసేటి మొహమా! నోర్మూసుకొని మా వాళ్లు చెప్పిన చోట సంతకాలు పెట్టు" గద్దించాడు.

" అయ్యా ! గతిలేక దారి తప్పాను. మన్నించండి. ఈసారికి ఒదిలేస్తే బుద్ధిగా బతుకుతాను. నన్ను మా వాళ్ల దగ్గరికి పంపించెయ్యండి. కలో గంజో తాగి బతుకుతాం!" ఏడుస్తూ బ్రతిమాలింది.

" ఒసే నిన్ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొంది వదిలేయడానికటే ! అసలే ఈ మధ్య కేసులు తక్కువై పోయి టార్గెట్ రాలేదు. నీ వెనకాల వున్న వాళ్ల గురించి చెప్పు ఓ పనైపోతుంది." ఎస్సై అడిగాడు.

" నాకెవరూ తెలియదండి" వినయంగా చెప్పింది.

ఇంతలో విలేఖరులు పోటీల మీద పోటీలు పడి ఆమె చరిత్ర చెప్పించుకున్నారు. ఆమె వారిస్తున్నా, ఆమెను మాటల్లో పెట్టి ఆమె అసలు ఊరు, తల్లిదండ్రుల పేర్లు, మొదలైన వివరాలు సేకరించారు.

ఆమె అసలే పసిప్రాయం.

ఆపైన మొరటు జనం

తెలివి మీరిపోయిన విలేఖరులు.

ప్రశ్నల వర్షం - ఆలోచించుకోవడానికి... ఆలోచించి సమాధానం చెప్పడానికి వీలు ఇవ్వడం లేదు.

అందుకే ఆమె మొహాన్ని చేతుల్లో కప్పుకొని ఏడుస్తూ అడిగింది.

" అయ్యా! మీరంతా చదువుకున్నోళ్లు- బాగా బ్రతుకుతున్నవాళ్లు- నా లాంటి అభాగ్యుల గురించి ఆలోచించండి- సమాజాన్ని ఆలోచించనివ్వండి. కాని నా ఫోటో కాని - నా మొహం కాని - నా అస్సలు పేరు కాని ఎక్కడా రాయకండి ప్లీజ్!" రెండు చేతులు జోడించి బ్రతిమలాడింది రాధ అని పిలవబడే ఆ అభాగ్యురాలు.

చక్రపాణి విజయగర్వంతో బయటికి వచ్చాడు. ఆ రోజు అతనికి చాలినంత మేత దొరికింది. దాన్ని వెంటనే రాసేసి ఛానెల్‌లో ప్రసారానికి పంపించాలి.

ఆ తరువాత రాధ ఎక్కడ అరెస్టు కాబడిందో ఆ చుట్టుపక్కల జనాలతో ఇంటర్వ్యూ కవర్ చేసుకున్నాడు. అతనొక ఫ్రీలాన్సు జర్నలిస్టు. జీవితంలో పైకి రావాలని తపన పడుతున్నవాడు. ఎవరికీ భయపడేవాడు కాదు.

రాధ గురించి ఒక వార్తా వ్యాఖ్య తయారు చేస్తున్నప్పుడు ఆమె వేడికోలు మొహం, పసితనం వీడని బేల మొహం పదే పదే అతన్ని కలవరపరిచింది. కానీ 'రంకు నేర్పినమ్మ - బొంకు నేర్పదా' అన్న సామెత అతనికి వంట పట్టింది. అందుకే అత్యుత్సాహంతో ఫోటోలు -క్లిప్పింగులు- విశ్లేషణలు పత్రికలకు, ఛానెళ్ళకు పంపించి విశ్రమించాడు.

రాధకు ఆరోగ్యం బాగా లేకపోతే పోలీసు కస్టడీలో జనరల్ ఆసుపత్రికి తరలించారు. నిన్నటి నుంచి ఆమెకు తీవ్రమైన జ్వరం వస్తోంది. కాని అక్కడ ఆమెకు ఇంజక్షన్ ఇవ్వాలన్నా నర్సులు సైతం భయపడుతున్నారు. తోటి పేషెంట్లు కూడా ఆమెని గుచ్చి గుచ్చి చూసి చూపులతో చంపుకుతింటున్నారు.

" ఏమ్మా ! ఏం తప్పు చేశావు?" ఒక పెద్దామె అడిగింది.

తలొంచుకుంది రాధ.

" ఈ వయసులో నీకివేం బుద్ధులు.... బాగా చదువుకుఒని పైకి రావలసింది" ఒక ఆమె చెప్పింది.

" ఆమె దగ్గర కూర్చోవద్దు. ఆ జబ్బులు తగులుతాయి" వార్డుబాయ్ వచ్చి వాళ్లను అదిలించాడు.

" కొంపదీసి ఎయిడ్స్ కాని వచ్చిందా?" ఓ చదువుకున్నావిడ అడిగింది.

" ఏమో - ఇంకా రిపోర్టులు రాలేదు" చెప్పాడు వార్డుబాయ్.

" ఆ ! దీని ముఖం ఎక్కడ చూశానా? అని ఇందాకటి నుంచి ఆలోచిస్తున్నా. పొద్దున్న పేపర్లో వచ్చిందిగా దీని గురించి దీని బాగోతం,అంతా రాశారు" చదువుకున్నావిడ గుర్తు చేసుకుంది.

" పేపర్లో ఏంటి? నిన్నటి నుంచి కేబుల్ టీవీలో దీన్ని చూపిస్తూనే వున్నారుగా" వెకిలి నవ్వుతో చెప్పాడు పోలీసు కానిస్టేబుల్.

జ్వరంతో మగతగా బాధపడుతున్న రాధకు ఆ మాటలు ములుకుల్లా గుచ్చుకున్నాయి. ఆమెకు తన గతం గుర్తుకొచ్చింది.

మాధవి తొమ్మిదవ క్లాసు చదువుతున్నది. ఏడవ క్లాసులోనే పెద్ద మనిషి అయింది. వయసు ముంచుకొస్తున్నది. తెలిసి తెలియని వయసు ముందొచ్చిన చెవుల కంటే వెనుకొచ్చిన కొమ్ములు వాడి అని దేవుడు బాల్యంలో ఇచ్చిన సొగసు కంటే కౌమారంలో ఇచ్చిన అందాలు వాడిగా వేడిగా చూపరులను ఆకర్షిస్తున్నాయి. ప్రతి మొగ సన్నాసి తనను అదో రకంగా చూడడం ఆమె గమనించసాగింది.

తోటి మగ పిల్లలు తన స్నేహం కోసం ఆరాటపడడం తనతో మాట్లాడాలని తాపత్రయపడడం వాళ్లల్లో వాళ్లు తగవులు పడడం దొంగచాటుగా గమనించసాగింది.

దీనికి తోడు ఇంట్లో అమ్మానాన్నల నస ఎక్కువైంది. తనపైన నిఘా- హితబోధలు ఎక్కువయ్యాయి.

" బాయ్ ఫ్రెండ్స్‌కి దూరంగా వుండమ్మా! నీ ధ్యాస చదువుమీద వుండాలి. చదువుకొని పెద్ద సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలి!" తల్లి చెప్పేది.

" అయితే ఏంటి లాభం!" అమాయకంగా అడిగేది మాధవి.

" బోల్డు డబ్బులు వద్దంటే డబ్బులు - నెలనెలా వచ్చే జీతం ఏం చేసుకోవాలో తెలియనంత డబ్బులు" ఆశగా తల్లి చెప్పేది.

" ఎంతొస్తుందేంటి?"

" ఎంతో నాకైతే తెలీదు కాని మీ నాన్నగారు సంపాదించే దానికి అయిదు, పది రెట్లు రావచ్చు. వాళ్ళే అమెరికా పంపిస్తారట! అక్కడ డాలర్ల పంట- నెలకు లక్షరూపాయలు కూడా మాకు పంపించ వచ్చుట!" ఆమె అమాయకంగా చెప్పేది. తల్లి మాటలలో నిజం వుందని నమ్మేది మాధవి. ఎందుకంటే ఆమె స్నేహితురాళ్ళల్లో కొందరి అక్కలు, అన్నలు,

బావలు, తదితర బంధువులు హైదరాబాద్‌లో, బెంగుళూరులో, అమెరికాలో ఇంజనీర్లుగా రెండు చేతులా సంపాదిస్తున్నారని వింది.

అందుకే తను కూడా బిటెక్కు చేసి హైటెక్కు లైఫ్ పొందాలని కలలు కంటున్నది.

సరిగ్గా అటువంటి సమయంలో ఆమెకు సుకుమార్‌తో పరిచయం అయింది. సుకుమార్ చాలా అందంగా ఉంటాడు. అందంగా మాట్లాడుతాడు అందమైన మోటర్ బైక్‌లో తిరుగుతూ వుంటాడు.

ఒకసారి టీవీ చెడిపోతే మెకానిక్కును వెతుక్కుంటూ అక్కడికి వెళ్లింది. సుకుమార్ చలాకీతనానికి అబ్బురపడింది.

టీవిని అక్కడికి తీసుకురమ్మన్నాడు ముందు.

" ఒకసారి వచ్చి చూసి పోకూడదా! అంత పెద్ద సెట్టు తీసుకురావాలంటే చాలా కష్టం" చెప్పింది.

అతనికి షాపులో చాలా పని వుంది. కాని ఆమె అభ్యర్థనని అతను తోసిపుచ్చలేదు. అడ్రస్ అడిగి తీసుకున్నాడు వస్తానని చెప్పి.

అలాగే ఆ రాత్రి అతను వచ్చి టీవిని చూసాడు. సెట్టు ఓపెన్ చేసి రిపేర్ చేశాడు. ఓ మాదిరిగా బొమ్మ వచ్చేటట్లు చేశాడు.

" ఒక ఐసి పోయింది నా దగ్గర దొరుకుతుందేమో చూస్తాను" అని చెప్పాడు. ఆ రోజు అతను సర్వీసు చార్జి ఇస్తానన్నా తీసుకోలేదు. ఐసి వేసిన తర్వాత మళ్లీ తీసుకుంటానన్నాడు.

అతను మూడు నాలుగు రోజులు గడిచినా రాలేదు. మళ్లీ వెళ్ళి అడిగింది. తమ టీవి ఇంకా పూర్తిగా రిపేరు కాలేదని.

" ఏం చేస్తాం మధూ.. ఆ ఐసి కోసం ఊరంతా తిరిగాను. ఎక్కడా దొరకలేదు. హైదరాబాద్ నుంచి తెప్పించాలి" తియ్యగా చెప్పాడు. ఆ రోజు అతను ఖాళీగా వున్నాడు. అందుకే మాధవికి కుర్చీ చూపించి కూర్చోమన్నాడు.

" ఆ టీవి చూసే కంటే వింటేనే బాగుంటున్నది. ఆ బొమ్మ చూడలేక కళ్ళు పోతున్నాయి." చెప్పింది మాధవి.

" దాన్ని అమ్మేసి కొత్తది కొనుక్కోవచ్చు కదా! ఓల్డు మోడల్. ఇప్పుడు పార్టులు దొరకడం కష్టం" చెప్పాడు.

" డబ్బులుండొద్దు... ఇంతకీ ఆ పార్టు ఎప్పుడు తెప్పిస్తారు?" అడిగింది.

ఇంతలో చాయ్ వాలా చాయ్‌లు తెచ్చాడు. ఆమెకో గ్లాసు ఇచ్చి తానొకటి తీసుకున్నాడు. ముందు మాధవి మొహమాటపడినా తరువాత తాగింది.

అలా అప్పుడప్పుడు సైకిలేసుకొని ఆ షాపు కొచ్చి ఎంక్వయిరీ చేసి పోయేది. అలా రోజులు దొర్లిపోయాయి. మాటలు, పరిచయాలు పెరిగాయి.

ఒక రోజు ఐసి దొరికిందని తెచ్చాడు. ఆ రోజు ఆమె అమ్మానాన్న పరిచయస్తుల పెళ్లికని వెళ్లారు. మాధవి చదువుకుంటానంటే వదిలేసి, సుకుమార్‌కు మంచి అవకాశం దొరికింది. టివి రిపేర్ చేయడమే కాకుండా ఆమె మనసును కూడా రిపేర్ చేశాడు. మెంటల్‌గా ప్రిపేర్ చేశాడు పార్టీకి రమ్మని.

" రేపు నా బర్త్‌డే ! ఎవరినీ పిలవడం లేదు. ఒక్క నిన్ను తప్ప రేపు మధ్యాహ్నం నువ్వు వస్తే డిన్నర్ కలిసి తిందాం!" అహ్వానించాడు ఆశగా.

" కాని నాకు స్కూలుందిగా" చెప్పింది బలహీనంగా నవ్వుతూ.

" ఫర్వాలేదు. ఒక్కపూట నా కోసం మానుకో, ఏం కొంపలు అంటుకోవు."

" అమ్మో ! అమ్మా నాన్నకు తెలిస్తే ఇంకేమన్నా వుందా?" భయపడింది.

" తెలిస్తేగా... ఉదయం పూట స్కూలుకు వెళ్లు. మధ్యాహ్నం తలనెప్పి అని చెప్పి బడి ఎగ్గొట్టు. నేరుగా మా షాపుకు రా. అక్కడినుంచి డిన్నర్ తీసుకొని సిన్మాకు వెళదాం. ఆ తర్వాత నీ మామూలు టైముకు ఇంటికొచ్చేయి" ప్లాను చెప్పాడు.

" అమ్మో ! నాకు భయం నేను రాను" మొహమాటంగా చెప్పింది మాధవి.

" అయితే రేపు నాకు ఉపవాసమే! బర్త్‌డే నాడు ఉపవాసం వుండిన పుణ్యం నీవలన నాకు వస్తుంది ఆలోచించుకో" అంటూ అతను నిష్టూరంగా మాట్లాడి వెళ్లిపోయాడు.

ఆ మరూనడు మాధవి స్కూలు ఎగ్గొట్టి అతని షాపుకు వెళ్లింది. అతని మొహం చాటంటయింది. వెంటనే షాపు కట్టేసి ఆటోలో పెద్ద హోటల్‌కు తీసుకుపోయాడు.

" మాధవి... ఇక్కడ హాల్లో డిన్నర్ తీసుకుంటే మీకు తెలిసిన వాళ్లు కనపడవచ్చు. అందుకని పైన ఓ గదిలో అరేంజ్ చేశాను. పైకి వెళదాం" చెప్పాడు.

మాధవికి హోటళ్లు కొత్త. ఎప్పుతూ పరాయి వ్యక్తితో బయట తినలేదు. అందుకే అమాయకంగా అతని వెంట లాడ్జిలోని గదికి వచ్చేసింది.

అంత ఖరీదైన రూమును చూసి ఆమె అబ్బురపడింది.

అతను డిన్నర్ రూములోకి ఆర్డర్ చేశాడు.

కాసేపటికి బేరర్ వచ్చి అన్నీ సర్ది పోయాడు.

మాధవికి చాలా మొహమాటంగా, ఇబ్బందిగా వుంది. తప్పు చేస్తున్నానన్న భావంతో తలవంచుకు కూర్చుంది.

" ఇంత ఖరీదైన రూము డిన్నర్‌కు తీసుకొన్నావా?" అడిగింది.

" మరి నా బర్త్‌డే జీవితంలో గుర్తుండి పోవాలిగా అయినా నీ కంటే నాకివన్నీ

ఎకు ఊకవ కావు. మాధవి నువ్వు నా జీవితంలోకి ప్రవేశిస్తే నన్ను మించిన అదృష్టవంత లెవరుంటారు?" అంటూ ఏవేవో కబుర్లు చెప్పాడు. మాధవి ఆ మాటలకు పరవశురాలై పోయింది.

అక్కడున్న టీవీ ఆన్ చేశాడు. ఇంగ్లీష్ పిక్చర్ వస్తోంది... సెక్సు... " ప్లీజ్ టీవీ కట్టెయ్యి" మాధవి వారించింది.

" ఏం మనకు పెళ్లయితే మనం అలా..." అంటూ మాధవి పెదవుల మీద ముద్దు పెట్టుకున్నాడు ఊహించలేనంత వేగంగా.

తొలి ముద్దు నరాల్లో రక్తం వేగంగా ప్రవహించింది. ఆమె కళ్లు మగతగా మూసుకున్నాయి. సుకుమార్ ఆమెను దగ్గరగా లాక్కున్నాడు.

మాధవి వివేకం మేల్కొంది. అభ్యంతరం తెలిపింది.

" ప్లీజ్ ! ఒక్కసారి..."

" నో ... నో... నాకిప్పుడు ఇష్టం లేదు. పెళ్లయిన తర్వాత..."

" ఇవాళ నా హ్యాపీ బర్త్‌డే. అడ్డు చెప్పకు. నీ కోసం ఈ చైన్ తెచ్చాను. పదివేలు పెట్టి" అంటూ జేబులోంచి నెక్లెసు తీశాడు.

మాధవి నిశ్చేష్టురాలైంది. దాన్ని ఆమె మెడలో అలంకరించింది. ఆమెను తనలో కలుపుకున్నాడు.

మాధవి ఈసారి అభ్యంతరం పెట్టలేకపోయింది. అతనికి తనపై ఉన్న ప్రేమకు మురిసి పోయింది. పెళ్లి చేసుకుంటాడని నమ్మింది కూడా.

ఆ రోజు ఆకాశంలో తేలిపోతూ ఇంటికి వచ్చింది.

ఆ తర్వాత కూడా ఈ ఒక్కసారి, ఈ ఒక్కసారి అంటూ లాడ్జికి తీసుకుపోయి ఎంజాయ్ చేశాడు సుకుమార్ చాలా సార్లు.

కొన్నాళ్లకు నెల తప్పింది మాధవి.

ఆ రోజు వెక్కి వెక్కి ఏడుస్తూ అతన్ని నిలదీసింది.

ఎప్పుడు పెళ్ళి చేసుకుంటావంటూ ముందు కడుపు తీయిస్తానన్నాడు. తీయించుకోమన్నాడు. కాని మాధవి తనకు పెళ్లే ముఖ్యమని చెప్పింది. చెడిపోయిందన్న ముద్ర తనమీద పడకూడదని, పెళ్లయిన తరువాత అతని ఇష్టప్రకారం చేద్దామని చెప్పింది. మామూలుగానే కులాల అడ్డు వుంది. తల్లిదండ్రులకు చెపితే ఒప్పుకోరు. తను ఉన్నత కులస్తురాలు. అతను నిమ్న కులస్తుడు. అందుకే గుళ్లో పెళ్లిచేసుకొని తరువాత చెబుదామనుకుంది.

దానికి సుకుమార్ ప్లాన్ చెప్పాడు. దాని ప్రకారం స్కూలుకని బయలుదేరి అతనితో

కలిసి సింహాచలం పారిపోయింది. అక్కడ దేవుడి సాక్షిగా అతను మెళ్లో మంగళ సూత్రం కట్టాడు.

హనీమూన్ అంటూ వైజాగ్ తీసుకుపోయాడు. ఒక్క రోజు లాడ్జిలో గడిపిన తరువాత తెలిసిన వాళ్ల ఇంటికని ఒక చోటికి తీసుకుపోయి తిరిగిరాలేదు. తర్వాత తెలిసింది. అతను తనను ఒక వేశ్యాగృహానికి అమ్మివేశాడని లక్షలకు.

మాధవి తేరుకునే లోగానే ఆమెను విటులకు ఎర వేశారు. ఎంత ప్రతిఘటించినా... ఎంత ఏడ్చి మొత్తుకున్నా వాళ్ల నీచత్వం ముందు ఓడిపోయింది. కనీసం తల్లిదండ్రులకు ఫోన్ చేసి కూడా సమాచారం అందించలేక పోయింది. ఆమెను పిల్లి తన పిల్లలను మార్చినట్లు ఎన్నో పట్టణాలు, ఊళ్లు తిప్పి కొత్త కొత్త వేశ్యాగృహాలకు తరలించారు. అబార్షన్ ముందే చేయించారు. ఆమె తప్పించుకోకుండా పకడ్బందీగా కాపలా కాస్తూ ఉంటారు రౌడీలు.

ఇలా నరకం అనుభవిస్తున్నది. తింటానికి సరైన తిండి కూడా వుండదు. కంటినిండా కునుకు కూడా వుండదు. రాత్రింబవళ్లు ఒళ్లు అమ్ముకోవడమే పని! ఆకలికి తట్టుకోలేక బాతురూముకు పోయినప్పుడు రహస్యంగా దాచుకున్న తిండి తినాల్సి వస్తుంది అప్పుడప్పుడు రోజుకు ఎంతమందితో ఎన్ని గంటలు గడిపిందో మొదట్లో ఆమె లెక్కించేది. తరువాత తెగని లెక్కలు ఎందుకని మానుకుంది. రోజుకు ఎన్నిగంటలు నిద్ర పోగలిగిందో లెక్క చూసుకునేది.

కేవలం సుకుమార్‌పై పగ తీర్చుకోవాలని బ్రతుకుతున్నది. ఒక్క రోజు వాడు దొరక్కపోడు. వాడిని తన చేతులతో అంతమొందించాలన్న వెర్రి ఆవేశంతో బ్రతుకుతున్నది.

నిన్న ఆ ఎస్సైకి వాడి పేరు చెప్పింది. అతను నోట్ చేసుకున్నాడు కూడా.

ఆమె మగతగా పడుకొని వుండగా చక్రపాణి వచ్చాడు.

" హలో ఎలా వున్నావు రాధా? బాగున్నావా? ఇక్కడ ట్రీట్‌మెంట్ బాగుందా? బాగాలేకపోతే చెప్పు... వీళ్లని కడిగిపారేస్తాను మీడియాలో" చెప్పాడు.

రాధ బరువుగా కళ్లు తెరిచి చూసింది. లేని ఓపికను తెచ్చుకుని మంచం మీద కూర్చుంది ఆమె కన్నీళ్లు పెట్టుకుంది.

" రాధా ! బాధపడొద్దు, ప్రభుత్వం నిన్ను చదివిస్తుంది. నీకు పునరావాసం ఏర్పాటు చేస్తుంది. కాని ఇటువంటి తప్పుడు పనులు మళ్లీ చేయకు" చెప్పాడు.

" అంటే నేను కావాలని చేశానా బాబూ!" అడిగింది.

" రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు! నీకో గుడ్ న్యూస్, ఇంకో బ్యాడ్ న్యూస్... చెప్పమంటావా!" అడిగాడు సస్పెన్సు కలిగిస్తూ.

" నేను వద్దన్నా నా గురించి పేపర్లో రాశారు. వద్దన్నా టీవీకి ఇచ్చారు. ఇప్పుడు వద్దంటే వింటారా? చెప్పండి" అంది రాధ.

" వాడు సుకుమార్ దొరికాడు. కాని వాడికిప్పుడు రాజకీయ అండదండ లున్నాయి. చిన్నపాటి రాజకీయ నాయకుడయ్యాడు. నువ్వెవరో తెలీదని చెప్పాడు. పోలీసులు ఎంక్వయిరీ చేస్తున్నారు" గర్వంగా చెప్పాడు.

" ఇది గుడ్‌న్యూసే కదా!" ప్రశ్నించింది రాధ." మరి?

" ఆ ! వస్తున్నా.. నీ ఫోటో పేపర్లో చూసి టీవీలో నీ రూపం చూసి గుర్తుపట్టిన వాళ్ళు మీ అమ్మానాన్నల దగ్గరికి పోయి విషయం చెప్పారు." చక్రపాణి ఆగాడు ఆమె ఫీలింగ్స్‌ని గమనిస్తూ.

" నన్ను తీసుకుపోవడానికి వస్తున్నారా మావాళ్లు వారికి నిజంగా ద్రోహం చేసాను. చదువుకోవలసిన దాన్ని ఆ మాయల మరాఠీ చేతిలో చిక్కుకుపోయాను. ప్లీజ్ నా గురించి ఏమన్నారు?" ఆతృతగా ఏడుస్తూ అడిగింది.

" సారీ ! వాళ్లు నిన్ను కూతురిగా అంగీకరించలేదు. వాళ్ల మాధవి ఎప్పుడో చచ్చిపోయిందట! నీకు వాళ్లకు సంబంధం లేదట! కాకపోతే నీకు వాళ్ల కూతురు పోలికలు కొన్ని కలిశాయట. మనుషులను పోలిన మనుషులు వుండడం సహజం కదా... అందుకని ఒక నీతిమాలినదాన్ని తమ కూతురు అనుకోవడం ఏం న్యాయం అని తిరస్కరించారు" చెప్పాడు బాధగా.

రాధ షాక్ తింది. ఎక్కడో ఆమెకు తల్లిదండ్రులు తనను అక్కున జేర్చుకుంటారని, తను చేసిన తప్పు మన్నిస్తారని, మినుకుమినుకుమంటూ ఆశ వుండేది. ఆమె కనే మధుర స్వప్నాలలో అది మొదటి స్వప్నం. కాని చక్రపాణి మాటలు ఆమెకు అశనిపాతంలా తగిలాయి.

" రాధా! బాధపడకు. నిన్ను చూడ్డానికి మంత్రిగారు, ఎమ్మేల్యేలు రాబోతున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. నీకు బంగారు భవిష్యత్తు వుంటుంది." చెప్పాడు చక్రపాణి.

" ఇంకానా సారూ! మీరంత పబ్లిసిటీ ఇచ్చింతర్వాత కూడా నాకు మంచి భవిష్యత్తు వుంటుందంటారా! అప్పట్లో ఎట్లాగైనా తప్పించుకుని పారిపోయి ఎక్కడైనా గౌరవంగా బ్రతుకుదామనుకునే దాన్ని. నా గురించి తెలియని వూళ్లో గౌరవంగా అందరిలా స్వేచ్ఛగా జీవిద్దామనుకునేదన్ని కాని.. కాని.. .ఇప్పుడు నా పేరు, నా మొహం అందరికీ తెలిసి పోయింది. నాది గతించిన గతం! ఎక్కడికి పోయి ఎలా బ్రతకను?" వలవలా ఏడ్చింది రాధ.

" ఇంత ఆత్మాభిమానం కలదానివి ఆ లాడ్జిలో రైడింగులో పోలీసులకలా దొరక్కుండా వుండాల్సింది. అస్సలు ఆ లాడ్జికి పోకుండా ఉండాల్సింది" అన్నాడు చక్రపాణి.

" బాబుగారూ రామాయణమంతా విని రాముడికి సీత ఏమవుతుందని అడిగినట్లు నా కతలన్నీ మీరు విన్నారు. మళ్లీ మళ్లీ మీ ప్రశ్నలతో నన్ను బాధిస్తున్నారు. ఈ సమాజంలో ఒక పారవేయబడిన చెత్తకుండీని నేను. చెత్తకుండీకి చెత్తను స్వీకరించకుండా వుండే స్వేచ్ఛ వుందంటారా? సర్వం కోల్పోయిన దాన్ని. నా ముందు వెనకాల ఎవరూ లేని దాన్ని. నా ఇష్టాలు నడుస్తాయా? నా పెత్తనం చెల్లుబాటు అవుతుందా?" బాగా ఆవేశపడి పోయింది రాధ.

" రాధా కూల్‌డౌన్! అడుసు తొక్కనేల కాలు కడుగనేల?" అని చిన్నప్పుడు చదువుకునే వుంటావు. సుకుమార్‌తో చేసిన స్నేహం నీ మొదటి తప్పు. వాడిని నమ్మడం నీ రెండవ తప్పు. వాడితో లేచిపోవడం అంటే లక్ష్మణరేఖ దాటడం నీ మూడవ తప్పు" చక్రపాణి చెప్పాడు.

ఏ తప్పుకైనా దిద్దుకునే అవకాశం వుంటుంది. కాని నా తప్పులకు ఆ అవకాశం దొరకలేదు. ఇప్పుడు మీరిచ్చినా ఆ అవసరం నాకు లేదు" బావురుమంది.

" సారీ ! నా వలన నీకు అపకారం జరిగిందని భావిస్తున్నావు. కనీసం మీ తల్లిదండ్రులను ఒప్పించి నీకు మనశ్శాంతి కలిగిస్తాను" చెప్పాడు.

" అక్కర్లేదు- ప్లీజ్ ! నా కన్నతల్లిదండ్రులే నన్ను అర్థం చేసుకోలేనప్పుడు ఈ సమాజం ఎలాగూ అర్థం చేసుకోలేదు. అయినా నాకు తెలియకడుగుతాను. మా సెక్సు వర్కర్లను నీతి తప్పిన వాళ్ళని వేలెత్తి చూపుతున్నారు? మేం చేస్తున్న నేరం ఏమిటి? మిగతా కార్మికుల్లాగానే కాయకష్టం చేస్తున్నాం. కార్మికులు వాళ్ల కండల్ని కరిగించి పొట్టలు పోషించుకుంటున్నారో వారి లాగా మా ఒళ్లు గుల్ల చేసుకొని మా యవ్వనాన్ని కరిగించి మా కడుపులు నింపు కుంటున్నాం! తప్పా! మేధావులనబడే వాళ్లు, గొప్ప గొప్ప చదువులు చదువుకునోళ్లు వాళ్ల తెలివి తేటల్ని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. మేము శరీరాల్ని అమ్ముకుంటే వాళ్లు మెదడును అమ్ముకుంటున్నారు. మరి కార్మికులను, మేధావులను గౌరవిస్తున్నారు. మమ్మల్ని హీనంగా చూస్తున్నారు. మసిగుడ్డల్లాంటి వాళ్లం మీ సభ్య సమాజానికి పట్టిన మసిని మా దగ్గర తుడుచుకుంటున్నారు. మా కష్టమర్లకు మీరు చాలా గౌరవం ఇస్తారు. మాకు కనీస మర్యాద కూడా ఇవ్వరు. ఇదెక్కడి న్యాయం? మేము లేకపోతే సంఘం బాగుపడుతుందని మీరనుకుంటున్నారు. కాని మాలాంటి సెక్సు వర్కర్లు లేకపోతే అత్యాచారాలు ఇంకా పెరిగి పోతాయని నేనంటున్నాను. అరవై ఏళ్ల కామాంధుడు ఐదేళ్లు, పదేళ్ల పాపల్ని రేప్ చేయడం మీకు తెలియదా? పెళ్లికాని వాళ్లు,

శారీరక సుఖానికి దూరమైన వాళ్లు, మేం అందుబాటులో లేకపోతే మరిన్ని ఘోరాలు, నేరాలు ఈ సభ్య సమాజంలో సృష్టిస్తారు అని తెలుసుకోండి! మమ్మల్ని కూడా సమాజ సేవకులుగా భావించండి!" రాధ బాధపడింది.

"మీరు డబ్బులు దండుకోకపోతే అలాగే సమాజ సేవకులుగా భావిస్తాం" చక్రపాణి అన్నాడు.

"మరి చెయ్యి ముట్టుకోకుండా వేలకు వేలు గుంజుకునే డాక్టర్లను మీరు సమాజ సేవకులుగా గుర్తిస్తున్నారు. లంచాలు దిగమింగే రాజకీయ నాయకులను సమాజ సేవకులుగా గుర్తిస్తున్నారు. మేము కడుపుకోసం ఆకలి మంటలు ఆర్పుకోడం కోసం ఈ వృత్తి చేపట్టాం. మాలో ఎవరైనా కోట్లు సంపాదించారా? ఆలోచించండి. భగవంతుడు మాకు అన్ని రోగాలు ఇచ్చి మా ఆయుష్షులో సగంపైనే హరించి వేస్తాడు" అంటూ రాధ రెండు చేతులు మొహానికి కప్పుకొని ఏడ్చింది.

ఆ రాత్రి రాధ బాధనంతా ఒక ఆర్టికల్‌గా రాసి ఒక పేపరుకు పంపాడు. మరునాడు ఆ పేపరును తీసుకొని రాధకు చూపిద్దామని వచ్చాడు చక్రపాణి. కాని వార్డుబాయ్ అతన్ని నేరుగా మార్చురీ రూంకు తీసుకుపోయాడు. రాధ శవం మీదున్న ముసుగును తొలగించాడు.

తెరుచుకునే ఉన్న ఆమె కళ్లు నా చావుకు బాధ్యులెవరు? అని ప్రశ్నిస్తున్నట్లుగా అనిపించింది.

– నవ్య నవంబర్ 12, 2007